

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, ఆగస్టు 11, ప్రభాతవార్త** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి సోమవారం సాయంత్రానికి 15687 క్యూసెక్కుల వంతునవరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 39.964 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 300, ఎన్ఎఫ్‌సికి 340, పెన్నా డెల్టాకు1000, కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 94.156 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# దేశ ప్రధానిని కలిసిన ఎంపీ వేమిరెడ్డి



**నెల్లూరు రూరల్, ఆగస్టు 11, ప్రభాతవార్త** దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం ఢిల్లీలో ప్రధానమంత్రి కార్యాలయానికి ఇతర ఎంపీలతో కలిసి ఎంపీ వేమిరెడ్డి వెళ్ళారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డిని ప్రధాని నరేంద్ర మోడీ ఆప్యాయంగా పలకరించారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ఆపరేషన్ సింధూర్ ద్వారా మన దేశ సైనిక పరాక్రమాలను ప్రదర్శించారని ప్రధానమంత్రిని కొనియాడారు. నరేంద్ర మోడీ సారథ్యంలో దేశం మరింత పురోగమిస్తుందని ఎంపీ వేమిరెడ్డి పేర్కొన్నారు.

## దేశంలో ఇంటర్న్‌షిప్ పథకం అమలు స్థితి ఏమిటి?



**నెల్లూరు రూరల్, ఆగస్టు 11, ప్రభాతవార్త** దేశంలో ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ స్కీమ్ అమలు స్థితి తెలియజేయాలని ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కోరారు. ఈ మేరకు లోక్ సభలో పథకం అమలుపై పలు ప్రశ్నలు వేశారు. టాప్ 500 కంటే ఎక్కువ కంపెనీలు ఈ పథకంలో పాల్గొనడానికి ఆసక్తి చూపుతున్నాయనేది నిజమేనా అని ఆరా తీశారు. ఇందులో ఏమైనా సవరణలు ఉంటే తెలపాలన్నారు. ఈ విషయంలో సిఐఐ, ఎఫ్ఐసిసిఐ, ఇతర పరిశ్రమ సంస్థలు ప్రభుత్వానికి సహకరిస్తున్న అంశం తెలియజేయాలని కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నలకు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకం 2024 – 25 బడ్జెట్‌లో ప్రకటించబడిందని, ఐదు సంవత్సరాలలో టాప్ 500 కంపెనీలలో ఒక కోటి మంది యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందించడం దీని లక్ష్యమన్నారు. పైలట్ ప్రాజెక్టు కింద సంవత్సరంలో యువతకు 1.25 లక్షల ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. పైలట్ ప్రాజెక్ట్ కింద మొదటి రౌండ్‌లో భాగస్వామ్య కంపెనీలు దేశవ్యాప్తంగా పిఎంఐఎస్ పోర్టల్‌లో 1.27 లక్షలకు పైగా ఇంటర్న్‌షిప్ అవకాశాలను పోస్ట్ చేశాయన్నారు. దీనికి సుమారు 1.81 లక్షల మంది అభ్యర్థుల నుండి 6.21 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయన్నారు. భాగస్వామ్య కంపెనీలు 60,000 మందికి పైగా 82,000 కంటే ఎక్కువ ఇంటర్న్‌షిప్ ఆఫర్‌లను అందించాయని వివరించారు. అభ్యర్థులలో 28,000 కంటే ఎక్కువ మంది అభ్యర్థులు ఇంటర్న్‌షిప్‌లో చేరడానికి ఆఫర్‌లను అంగీకరించారు. 8700 కంటే ఎక్కువ మంది అభ్యర్థులు వారి ఇంటర్న్‌షిప్‌లో చేరారన్నారు. జనవరి 9, 2025న ప్రారంభమైన శిలీ ఇంటర్న్‌షిప్ స్కీమ్ పైలట్ ప్రాజెక్ట్ రెండవ రౌండ్‌లో, దాదాపు 327 భాగస్వామి కంపెనీలు దేశంలోని 735 జిల్లాల్లో 1.18 లక్షలకు పైగా ఇంటర్న్‌షిప్ అవకాశాలను పోస్ట్ చేశాయని తెలిపారు. ఈ రౌండ్‌లో 2.14 లక్షలకు పైగా దరఖాస్తుదారుల నుండి 4.55 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయని, 06.08.2025 నాటికి, భాగస్వామి కంపెనీలు యువతకు 78,500 కంటే ఎక్కువ ఆఫర్‌లను అందించాయన్నారు. రెండవ రౌండ్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కంపెనీలు 4,700 కి పైగా ఇంటర్న్‌షిప్ అవకాశాలను పోస్ట్ చేస్తే అభ్యర్థులకు 10,000 కి పైగా ఆఫర్‌లను కంపెనీలు అందించాయని, ప్రస్తుతం, ఆఫర్‌లను అమలు ప్రక్రియ పురోగతిలో ఉందని చెప్పారు. ఈ పథకం కింద, గత మూడు సంవత్సరాల సగటు దిళిళి వ్యయం ఆధారంగా మంత్రిత్వ శాఖ టాప్ 500 కంపెనీలను గుర్తించిందని, వీటితో పాటు, ఈ పథకంలో పాల్గొనాలనుకునే ఏదైనా ఇతర కంపెనీ/బ్యాంకు/ఆర్థిక సంస్థ, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆమోదంతో ఎన్రోల్మెంట్ అవ్వొచ్చున్నారు. పైలట్ ప్రాజెక్టు అమలు కోసం మంత్రిత్వ శాఖ సిఐఐఎఫ్ఐసిసిఐ వంటి పరిశ్రమ సహకారం ఉందన్నారు.

## ఎస్ఈఐఎల్ ఎనర్జీ అడ్మిన్ బిల్డింగ్‌కు ప్రతిష్టాత్మకప్లాటినం గ్రీన్ బిల్డింగ్ సర్టిఫికేషన్



**ముత్తుకూరు, ఆగస్టు 11, ప్రభాతవార్త:** భారతదేశంలో అతిపెద్ద స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తిదారులలో ఒకటైన ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్‌కు చెందిన అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ (అడ్మిన్ బిల్డింగ్)కు ప్రతిష్టాత్మక ఖిఱబితీది (ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్) ప్లాటినం గ్రీన్ బిల్డింగ్ సర్టిఫికేషన్ లభించింది. ఈ విజయం ఎస్ఈఐఎల్ ఎనర్జీ యొక్క స్థిరత్వం, పర్యావరణ పరిరక్షణ బాధ్యతలో నిబద్ధతకు నిదర్శనం. ప్రాజెక్ట్ – 1లో ఉన్న కంపెనీ అడ్మిన్ భవనం ప్రస్తుత గ్రీన్ బిల్డింగ్ రేటింగ్ సిస్టమ్‌లో 80 కంటే ఎక్కువ రేటింగ్‌ను సాధించింది. దీంతో భారతదేశంలో ప్లాంట్ ప్రాంగణంలో గ్రీన్ బిల్డింగ్‌ను కలిగి కలిగి ఉండి, ప్లాటినం గ్రీన్ బిల్డింగ్ సర్టిఫికేషన్ పొందిన మొట్ట మొదటి థర్మల్ పవర్ ప్లాంట్‌గా నిలిచింది. 3 సంవత్సరాలకు గుర్తింపును పొందింది. ఈ మైలురాయి, ఎస్.ఈ.ఐ.ఎల్, ఎనర్జీ కార్బన్ ఉద్గారాల తగ్గింపు, స్థిరమైన పద్ధతులను ప్రోత్సహించడంలో దాని అకింతభావానికి నిదర్శనం. విజయవాడలో జరిగిన గ్రీన్ ఆంధ్ర సమ్మిట్ 2025లో ఱబితీది ప్లాటినం సర్టిఫికేషన్‌ను ప్రదానం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, దిఱ (కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) భాగస్వామ్యంతో ఱబితీది నిర్వహించిన ఈ సమ్మిట్… రాష్ట్రవ్యాప్తంగా స్థిరమైన అభివృద్ధిని వేగవంతం చేయడానికి పరిశ్రమ నాయకులు, విధాన రూపకర్తలు, నిపుణులను ఒకచోట చేర్చింది. ఈ సందర్భంగా కంపెనీ దినివీ జనమేజయ మహాపాత్ర మాట్లాడుతూ.. "స్థిరత్వం మరియు పర్యావరణ నిర్వహణ పట్ల మా నిబద్ధతను ప్రతిబింబించే ఈ ప్రతిష్టాత్మక గుర్తింపును అందుకోవడం పట్ల మేము చాలా సంతోషంగా ఉన్నాము. మా బృందం అంకితభావం, కృషి లేకుండా ఈ విజయం సాధ్యం కాదు. మొత్తము పరిశ్రమకు ఒక ఉదాహరణగా నిలుస్తున్నందుకు, పచ్చని భవిష్యత్తుకు దోహదపడుతున్నందుకు మేము గర్విస్తున్నామని చెప్పారు. ఇంధన వినియోగాన్ని తగ్గించడం, నీటిని ఆదా చేయడం, వ్యర్థాలను తగ్గించడంలో ఎస్ఈఐఎల్ ఎనర్జీ యొక్క స్థిరత్వం పట్ల నిబద్ధత స్పష్టంగా కనిపిస్తుంది. కంపెనీ యొక్క దూరదృష్టి గల నాయకత్వం, అంకితభావం కలిగిన బృందం దాని సూపర్‌క్రిటికల్ థర్మల్ పవర్ జనరేషన్ కాంప్లెక్స్‌లో సుస్థిరతను జీవన విధానంగా మార్చుకుంది. బాధ్యతాయుతంగా దేశ పురోగతి కోసం విద్యుత్తును అందిస్తోంది.

## నిర్దిష్ట గడువులోపు అర్జీలకు పరిష్కారాలను చూపండి

- కమిషనర్ వై.ఓ నందన్



**నెల్లూరు కార్పొరేషన్, ఆగస్టు 11,ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లనుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందుకున్న స్థానిక సమస్యలకు నిర్దేశించిన గడువులోపు పరిష్కారం అందించాలని అధికారులను కమిషనర్ వై.ఓ. నందన్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ నందన్ పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ టిడ్కో గృహాల లబ్ధిదారులు చెల్లించిన మొత్తాలను తిరిగి చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అదేవిధంగా ఇంకా పూర్తికాని నిర్మాణాలను పూర్తిచేసి లబ్ధిదారులకు కేటాయించనున్నామని తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి రోడ్డు ఆక్రమణలు, అక్రమ నిర్మాణాల గురించి, మార్టగేజ్ విడుదల గురించి అర్జీలు అందుకున్నామని తెలిపారు. ఇంజనీరింగ్ విభాగానికి సంభందించి రోడ్లు, డ్రైను కాలువల నిర్మాణం, సివిల్ వర్కులు, వీధి దీపాల ఏర్పాటు తదితర సమస్యలను అందుకున్నామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ అంశాలపై ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం అందించాలని, వాటన్నింటికీ నిర్ణీత సమయంలోగా పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విభాగాల వారీగా ఇంజనీరింగ్–9, హౌసింగ్–8, టౌన్ ప్లానింగ్ –10, రెవెన్యూ–2, పబ్లిక్ హెల్త్–3, అప్కాస్–1, మొత్తం 33 ఫిర్యాదులను అందుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ రామ్ మోహన్ రావు, ఆరోగ్య శాఖధికారి డాక్టర్ కనకాద్రి, సెక్రటరీ శ్రీలక్ష్మి, టి.పి.ఆర్.ఓ వాసు బాబు, ఇతర అన్ని విభాగాల అధికారులు, సూపరెంటెండెంట్ లు, సిబ్బంది పాల్గొన్నారు

## అబ్దుల్ అజీజ్ తో కావలి ఎమ్మెల్యే భేటీ



**నెల్లూరు, ఆగస్టు 11, ప్రభాతవార్త–వైద్యం** ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ తో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణా రెడ్డి హరనాథ పురంలోని అజీజ్ నివాసంలో భేటి అయ్యారు. ఈ సందర్భంగా వారు పలు రాజకీయ అంశాల పై చర్చించారు. అనంతరం కావలి నియోజకవర్గానికి సంబంధించిన పలు మసీదు కమిటీల పై చర్చించారు.

# ప్రభుత్వ స్కూల్ రూపు రేఖలు మారుస్తాం: మంత్రి నారాయణ

- 13ఉన్నత పాఠశాలలను వచ్చే జూన్ నాటికి అన్ని రకాలుగా తీర్చిదిద్దుతాం
- పీ-4 విధానంలో నగరంలోని 54 పాఠశాలల విడతల వారీగా అభివృద్ధి
- వీఆర్ పాఠశాలలో అధిక శాతం మంది పిల్లలు సర్వేపల్లి కాల్వకట్ట, పెన్నా కట్ట, జాఫర్ నగర్ కట్ట, కుసుమ హరిజనవాడకు చెందినవారే





**నెల్లూరు, ఆగస్టు 11, ప్రభాతవార్త–వైద్యం** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ 4 విధానంలో నగరంలోని 54 పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. సోమవారం ఆయన నగరంలో సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా మూలపేట ఏనుగు సుందరరామిరెడ్డి నగర పాలక ఉన్నత పాఠశాల, జెండా వీధిలోని పెండ్యాల నారాయణమ్మ నగర పాలక బాలికోన్నత పాఠశాల, సంతపేటలోని ప్రభుత్వ ఆదర్శ ఉన్నత పాఠశాల, రంగనాయకుల పేటలోని పీఎంఆర్ నగర పాలక ఉన్నత పాఠశాల జాకీర్ హుస్సేన్ నగర్‌లోని నగర పాలక ఉన్నత పాఠశాల, శెట్టిగుంటలోని యడ్లపల్లి వెంకటేశ్వర్లు నగరపాలక ఉన్నత పాఠశాల, నవాపేటలోని బీవీఎస్ నగర పాలక బాలికల ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఎంత మంది పిల్లలు ఉన్నారు..? అదనపు గదుల నిర్మాణం కొరత ఎంత ఉంది..? అలాగే ఫ్లోరింగ్ ఏర్పాటు మరియు మౌలి వసతుల కోసం ఏర్పాటుకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బీవీఎస్ బాలికలు ఉన్నత పాఠశాల తనిఖీ చేసి మీడియాతో మాట్లాడారు. ఎన్‌సీసీ గ్రూపు సహకారంతో వీఆర్ పాఠశాలను ఆధునీకరించామని అందేలో ఎక్కువ శాతం అడ్మిషన్ పొందిన వాళ్ళు నిరుపేదలు పేద కుటుంబాలకు చెందిన వారేన్నారు. ఎక్కువగా సర్వేపల్లి కాలువ కట్ట, పెన్నా కట్ట, జాఫర్ కట్టమీద వారు, కుసుం హరిజన వాడికి చెందిన వాళ్ల ఉన్నారని వివరించారు. రాబోయే జూన్ నాటికి నగరంలోని 13 పాఠశాలలను పీ4 విధానంలో ఆధునీకరించి అందుబాటులోకి తేవడం జరుగుతుందన్నారు. ఈ విషయమై పలువురు ఎన్నారైలు, వివిధ కంపెనీల ప్రతినిధులతో చర్చించడం జరిగిందన్నారు. అంతే కాకుండా గోల్డ్ మర్చంట్ అసోసియేషన్, క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్, లారీ ఓనర్స్ అసోసియేషన్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ వారితో చర్చించి అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. నుడా చైర్మన్ శ్రీనివాసులురెడ్డి శ్రీమతి కూడా ఒక స్కూల్ దత్తత తీసుకోవడానికి ముందుకు వచ్చారన్నారు. పీ4 విధానం బలవంతమైన చర్య కాదని, ఎవరైనాను స్వచ్ఛందంగా ముందుకు రావొచ్చని వెల్లడించారు. నెల్లూరులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుకు 165 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. గతంలో ఉన్న బకాయిలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. రాష్ట్రంలో పేద విద్యార్థులు సమూలుగా 15లక్షల మంది వరకు ఉన్నారని, రానున్న 4 సంవత్సరాలలో వారి అభివృద్ధికి కృషి చేస్తాన్నారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్, జిల్లా విద్యాశాఖ అధికారి బాలాజీ రావు, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ, నగర టీడీపీ అధ్యక్షులు మామిడాల మధు, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌ఛార్జీలు, టీడీపీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# పీ4 కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి పెట్టిన మంత్రి నారాయణ

- జైన్ అసోసియేషన్, క్లాత్ మర్చంట్ అసోసియేషన్ నేతలతో మంత్రి నారాయణ భేటీ
- పాఠశాల ఆధునీకరణకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్న అసోసియేషన్ నేతనలు
- నగరంలోని 13 హైస్కూల్స్‌ని వచ్చే విద్యా సంవత్సరం లోపు రేపురేఖలు మారుస్తాం
- ఆర్థికంగా స్థిరపడ్డ నెల్లూరు వాసులు పీ4లో భాగస్వాములు కావాలన్న మంత్రి



**నెల్లూరు, ఆగష్టు 11, ప్రభాతవార్త–వైద్యం** ఏపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పీ 4 కార్యక్రమంపై రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ప్రత్యేక దృష్టి పెట్టారు. సీఎం ప్రవేశపెట్టిన పీ4 కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా ఆయన అడుగులు వేస్తున్నారు. అందులో భాగంగా పీ4 ద్వారా మున్సిపల్ హైస్కూల్‌ను ఆధునీకరణకు శ్రీకారం చుట్టారు. పేద పిల్లలు చదివే స్కూల్స్‌ను దత్తత తీసుకునేందుకు మార్గదర్శకులు ముందుకు వస్తున్నారు. మరింత మంది ముందుకు వచ్చేలా మంత్రి సీరియస్‌గా దృష్టి పెడుతున్నారు. అందులో భాగంగానే జైన్ అసోసియేషన్ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ నేతలతో మంత్రి నారాయణ భేటీ అయ్యారు. స్కూల్ ఆధునీకరణకు తమ వంతు సహకారం అందిస్తామని మంత్రికి అసోసియేషన్ నేతలు తెలిపారు. అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం వీఆర్స్ ని అంతర్జాతీయ ప్రమాణాలతో సిద్ధం చేసి ప్రారంభించామని వీఆర్ హైస్కూల్ స్ఫూర్తితో మార్గదర్శకులు ముందుకొస్తున్నారని తెలిపారు. మూలపేట బాలికోన్నత పాఠశాలను డిఎస్ఆర్, అరెస్సార్ హైస్కూల్‌ను ఎంపీ వీపీఆర్ దత్తత తీసుకొన్నారని, పనులు కూడా ప్రారంభం అయ్యాయని, రెడ్డి లాబ్స్ జీవీకే ప్రసాద్, ఎన్నార్ఐ ఉదయ భాస్కర్, ఏఎంఆర్ కన్‌స్ట్రక్షన్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి సతీమణి సంధ్యా, డాక్టర్ అనీల్, జైన్ అసోసియేసన్, క్లాత్ మర్చంట్ అసోసియేషన్ స్కూల్స్‌ని ఆధునీకరించేందుకు ముందుకొచ్చారని మంత్రి వెల్లడించారు. సిటీలోని 13 హైస్కూల్స్‌ని వచ్చే విద్యా సంవత్సరంలోపు వీఆర్స్ తరహాలో తీర్చి దిద్దుతామన్నారు. ఆర్థికంగా స్థిరపడ్డ నెల్లూరు వాసులు పీ4 లో భాగస్వాములు కావాలన్నారు.

### క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు కిషోర్ కుమార్ కామెంట్స్

సీఎం ప్రవేశపెట్టిన పీ4 కార్యక్రమం ఆశయం చాలా గొప్పదని క్లాత్ మర్చంట్ అసోసియేసన్ అధ్యక్షులు తాతా వెంకట కిషోర్ కుమార్ పేర్కొన్నారు. పీ4లో తమ అసోసియేషన్ కూడా భాగస్వామి అవుతుందన్నారు. బాలాజీ నగర్‌లో మల్లెల సంజీవయ్య స్కూల్ ఆధునీకరణకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. వీఆర్స్‌పై దేశ వ్యాప్తంగా చర్చ జరిగేలా తీర్చిదిద్దిన మంత్రి నారాయణకు వారు అభినందనలు తెలిపారు. కమీషనర్ నందన్, టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ, నగర టీడీపీ అధ్యక్షులు మామిడాల మధు, క్లాత్ మర్చంట్ అసోసియేసన్ సభ్యులు, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌ఛార్జీలు, టీడీపీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## అత్యంత జాగ్రత్తగా సమస్యల పరిష్కారం

- సమస్యల పరిష్కార వేదికకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత
- ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 411 అర్జీలు
- అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి
- అధికారులకు జిల్లా జాయింట్ కలెక్టర్ కె. కార్తీక్ ఆదేశాలు



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 11, ప్రభాతవార్త** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ కె. కార్తీక్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్, ఇతర అధికారులతో కలసి నిర్వహించి పలు సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన సమస్యలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్న దృష్ట్యా, సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ముఖ్యంగా రీఓపెన్ అవుతున్నటువంటి కేసులలో రెవిన్యూ అధికారులు అత్యంత జాగ్రత్తగా పరిష్కారం చూపాలన్నారు.

**ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 411 అర్జీలు** కాగా సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం అర్జీలు అందాయి. వీటిలో ఎక్కువగా రెవెన్యూ శాఖకు సంబంధించి 141, పోలీస్ శాఖకు 62, మున్సిపల్ శాఖకు సంబంధించి 40, సర్వేకు 30, పంచాయతీ రాజ్ శాఖకు 38 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ హుస్సేన్ సాహెబ్, డ్వామా పిడి గంగా భవాని, డి ఆర్ డి ఎ పిడి నాగరాజ కుమారి, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుజాత, హార్టికల్చర్ ఏడి సుబ్బారెడ్డి, విద్యుత్ ఎస్ ఈ విజయన్, తదితరులు పాల్గొన్నారు.

## అదుపు తప్పి బోల్తాకొట్టిన కారు.. ఒకరు మృతి

- పలువురికి గాయాలు





**దగదర్తి, ఆగస్టు 11, ప్రభాతవార్త** దగదర్తి మండల ప్రాంతమైన సున్నబట్టి జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బంధువులు ఇచ్చిన సమాచారం మేరకు.. బెంగుళూరులోని యలహంక నందు నివాసముంటున్న పినపాటి రత్నరాజు(83) తన కుటుంబ సభ్యులతో కలిసి బెంగుళూరు నుంచి తెనాలికి కారులో వెళ్తూ ఉండగా సోమవారం ఉదయం సుమారు 6.30గంటల ప్రాంతంలో నెల్లూరు జిల్లా దగదర్తి మండలంలోని జాతీయ రహదారి 16 పై నెల్లూరు నుంచి కావలికి వెళ్తె రోడ్డు నందు సున్నబట్టికి సుమారు 2 కిలోమీటర్ల ముందు రత్నరాజు ప్రయాణిస్తున్న కారుని నడుపుతున్న రత్నరాజు అల్లుడు వంశీ సదరు కారుని అతి వేగంగా అజాగ్రత్తగా నడపటం వలన కారు అదుపు తప్పి రోడ్డు పక్కన తిరగబడగా.. అందులో ప్రయాణిస్తున్న రత్నరాజు అక్కడికక్కడే మృతి చెందగా రత్నరాజు భార్య విజయకుమారికి ఎడమ చెయ్యికి గాయం, కోడలు సుహాసినికి చిన్ని చిన్న గాయాలు అయ్యాయి.దగదర్తి ఎస్సై జంపనికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆన్‌వీల్స్–ఇంటి వద్దకే వైద్యం వాహనాలు ప్రారంభించిన మంత్రి నారాయణ

- నగరంలోని జెండా వీధి వద్ద వైద్య శిబిరం ఏర్పాటు
- పట్టణానికే కాకుండా పల్లెలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తుందన్న మంత్రి
- రెండు కోట్ల రూపాయలతో విలువ కలిగిన వాహనాలను ప్రారంభించిన మంత్రి
- ప్రతి రోజు ఒక డివిజన్‌కు తిరగనున్న ఆన్‌వీల్స్ వాహనం
- ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరిన మంత్రి



**నెల్లూరు, ఆగష్టు 11 ప్రభాతవార్త–వైద్యం** నారాయణ హాస్పిటల్ ఆన్ వీల్స్– ఇంటి వద్దకే వైద్యం వాహనాలను రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ప్రారంభించారు. నగరంలోని జెండా వీధి షాదీ మంజిల్ వద్ద మొబైల్ వైద్య శిబిరం నారాయణ హాస్పిటల్స్ వారు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మంత్రి నారాయణ పాల్గొన్నారు. డివిజన్‌కు విచ్చేసినటువంటి మంత్రికి స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. పట్టణాలకే కాకుండా పల్లెలకు కూడా మెరుగైన వైద్య సేవలు అందించాలని నారాయణ హాస్పిటల్ సంకల్పించిందని అందుకోసం రెండు కోట్లతో నారాయణ హెల్ప్ ఆన్ వీల్స్ వాహనాలను ఏర్పాటు చేశామన్నారు. ఆ వాహనంలో వైద్య సేవలు, పరీక్షలకు సంబంధించిన అన్ని సౌకర్యాలు ఉంటాయన్నారు. ఈ వాహనం ప్రతి రోజు ఒక డివిజన్‌కి వెళ్లి నిరుపేదలకు వైద్య సేవలు అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, అద్భుతమైన ఆలోచన చేసిన హాస్పిటల్ సిబ్బందికి మంత్రి నారాయణ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, కమీషనర్ నందన్, టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ, నగర టీడీపీ అధ్యక్షులు మామిడాల మధు, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌ఛార్జీలు, టీడీపీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.



## పడుగుపాడు సొసైటీ చైర్మన్ గా శ్యాంసుందర్ రెడ్డి



**కోవూరు ఆగస్టు 11 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని పడుగుపాడు సహకార సొసైటీ చైర్మన్ గా చెర్లోపాలెం గ్రామానికి చెందిన సీనియర్ టిడిపి నాయకులు నాగారెడ్డి శ్యాంసుందర్ రెడ్డిని ఏకగ్రీవంగా ప్రభుత్వం ఎంపిక చేసింది సభ్యులుగా వేగూరు గ్రామానికి చెందిన ఎన్ శ్రీనివాసులు పాటూరుగ్రామానికి చెందిన ఎన్ జై రామయ్య లను ఎంపిక చేశారు ఏం పిక్ చేసిన నూతన పాలకవర్గాన్ని టిడిపి నాయకులు ప్రత్యేకంగా అభినందించారు

## క్రీడా నైపుణ్యాన్ని మరింత పెంపొందించుకోవాలి



**కోవూరు ఆగస్టు 11 ప్రభాతవార్త :** ప్రస్తుతం సమాజంలో ఉన్న యువత చెడు మార్గాల వైపు పయనించకుండా క్రీడా నైపుణ్యాన్ని మరింత పెంపొందించుకోవాలని మండల తెలుగు పార్టీ అధ్యక్షుడు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు కోవూరు మండలం ఇనుమడ గ్రామంలో పి పి ఆర్ ఫౌండేషన్ ద్వారా పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి ద్వారా వచ్చిన వివిధ క్రీడా కిట్లను యువతకు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా కిట్లను యువత పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని అభివృద్ధి లోకి రావాలని ఆకాంక్షి ంచారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు టి శ్రీనివాసులు ఎస్కే సుభాన్ బి శ్రీనివాసులు ఎన్ రమేష్ వి నాగరాజు తదితరులు ఉన్నారు

## శాస్త్రవేత్తల సలహాలు సూచనలు రైతులు పాటించాలి



**కోవూరుఆగస్టు 11 ప్రభాతవార్త :** ప్రస్తుతం ఈ సీజన్లో వ్యవసాయం సాగు చేసే రైతులు తప్పనిసరిగా శాస్త్రవేత్తలు ఇచ్చే సలహాలు సూచనలను తప్పక పాటించాలని ఏ ఆర్ ఎస్ శాస్త్రవేత్తలు మధుసూదన్. పరమశివ శ్రీ లక్ష్మీ ్మ లు తెలిపారు కోవూరు పంచాయతీ పరిధిలోని పలు పొలాలను సోమవారం వారు పరిశీలన చేపట్టారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి పొలంలో ఎక్కువగా రంగు మారిన గింజలు కనిపిస్తున్నాయన్నారు దీని నివారణ గాను టిల్ట్ 150 ఎంఎల్ఏ ఒక ఎకరాకు పిచికారి చేసుకోవాలని సూచించారు అదేవిధంగా తమ ఇష్టానుసారంగా రైతులు ఎరువులు పురుగుల మందులు వాడుకో రాదని సిఫారసు చేసిన మోతాదులోనే వాటిని వాడుకోవాలని ఈ సందర్భంగా వారు రైతులకు వివరించారు ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు అనిత మండల వ్యవసాయ అధికారిని టీ రజని గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులు ఉన్నారు

## ఇంట్లో ఎవరు లేని సమయంలో అగ్ని ప్రమాదం
## 4 సవర్లు బంగారు 2లక్షలు నగదు అగ్నికి ఆహుతి



**మనుబోలు ఆగష్టు 11 ప్రభాతవార్త :** మండలంలోని వీరంపల్లి పంచాయితీ నాయుడుపల్లి గ్రామంలో సోమవారం ఉదయం ఓ ఇంట్లో కరెంటు షార్టు సర్క్యూట్ వలన అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. రావూరు వెంకటసుబ్బయ్య అనే రైతు కుటుంబసభ్యులు ఆ సమయంలో కురిచర్చపాడుకి వెళ్ళి ఉన్నారు. ఆ సమయంలో విద్యుత్ షార్టు సర్క్యూట్ జరగగా పొలం పనుల కోసం తెచ్చిన రెండు లక్షల డబ్బులు,నాలుగు సవర్లు బంగారు మంటల్లో కాలిపోయాయి. బీరువాలో గుడ్డలు, మంచాలు టీవి మొత్తం అగ్నికి ఆహుతయ్యాయని వారు వాపోయారు. పొదలకూరు నుండి ఫైర్ ఇంజన్ వచ్చి మంటు అదుపు చేశారు. ఈ సంఘటనలో మొత్తం ఏడు లక్షల రూపాయాలు ఆస్తి నష్టం వారి కుటుంబసభ్యుడు వెంకటేష్ తెలిపారు.

## ఉపాధి అవకాశాలు కల్పించండి

**– కలెక్టరేట్ ఎదుట ఆటో డ్రైవర్ల నిరసన**



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 11, ప్రభాతవార్త :** ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని తెలిపినందున ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నీ తిక్కన ప్రాంగణంలో జరిగిన ప్రజా విజ్ఞప్తుల దినంలో జెసి కార్తీక్ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ జిల్లా ప్రెసిడెంట్ కే సురేష్ కార్యదర్శి ఎం వి రాజాలు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు వలన తమకు బాడుగలు తగ్గుతాయన్నారు ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం డ్రైవింగ్ లైసెన్సు ఉన్న ప్రతి కార్మికుడికి ఏడాదికి 25000 వాహన మిత్ర ద్వారా అందించి ఆదుకోవాలన్నారు. జీవో నెంబర్ 21ని రద్దు చేయాలన్నారు. ఫీజులు పెనాల్టీలు ఇన్సూరెన్స్ ప్రీమియం తగ్గించాలన్నారు బ్యాంకు నుంచి వాహనముల కొనుగోలుకు నాలుగు లక్షల రూపాయలు రుణాన్ని సబ్సిడీతో కూడిన వడ్డీ లేని రుణాలు బ్యాంకు ద్వారా మంజూరు చేయాలన్నారు. మండలాలలో ఆటో పార్కింగ్లను ఏర్పాటు చేయాలన్నారు. ఓలా ఓ టి ఎస్ ఆటోమేటిక్ ట్రాకులు ప్రైవేటుకు ఇవ్వడం రద్దు చేయాలన్నారు. వాహన ఫిట్నెస్‌ను ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులు స్వీకరించిన అదనపు ఎస్పీ



**నెల్లూరు క్రైమ్ ఆగస్టు 11 ప్రభాతవార్త :** జిల్లా యస్పి జి.కృష్ణ కాంత్ ఆదేశాల మేరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ఉమేష్ చంద్ర సమావేశ మందిరంలో సోమవారం పోలీసు ఉన్నతాధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అదరపు ఎస్పీ సిహెచ్ సౌజన్య మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 98 ఫిర్యాదులు అందాయి. వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని కొడవలూరు పరిధికి చెందిన మహిళను నంద్యాలకు చెందిన కటారి రమేష్ అనే వ్యక్తి ప్రేమిస్తున్నానని నమ్మించి శారీరకంగా కలిసి ఉన్నట్లు, పెళ్లికి నిరాకరిస్తూ వేరొకరితో పెళ్లికి ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు, మోసపోయానని, విచారించి న్యాయం చేయాలని, అదేవిధంగా ఉదయగిరి పరిధికి చెందినటువంటి మహిళను వింజమూరు పరిధికి చెందిన హరేంద్రబాబు అనే వ్యక్తి ప్రేమిస్తున్నానని నమ్మించి కలిసి సహజీవనం చేసినట్లు, పెళ్లి చేసుకోకుండా మోసం చేస్తున్నాడని విచారించి న్యాయం చేయాలని కోరారు. అనంతసాగరం పరిధికి చెందిన వ్యక్తిని అదే గ్రామానికి చెందిన పొంతల తులసీధర్ అనే వ్యక్తి కువైట్ లో మంచి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి, మూడు లక్షల రూపాయలు నగదు తీసుకొని, కువైట్‌కి తీసుకెళ్లి అక్కడ హకామా ఇప్పించకుండా ఒక రూమ్‌లో బంధించినట్లు, కువైట్ పోలీసులు అరెస్ట్ చేసి ఐదు రోజులు జైల్లో పెట్టి తర్వాత తిరిగి దేశానికి పంపించినట్లు, తులసీధర్ తనకు జాబ్ ఇప్పించకుండా నగదు తిరిగి ఇవ్వకుండా మోసం చేశాడని, అడిగితే చంపుతానని బెదిరిస్తున్నాడని విచారించి న్యాయం చేయాలని కోరారు. నెల్లూరు రూరల్ పరిధికి చెందిన వృద్ధురాలిని, తన ముగ్గురు పిల్లలు ఉన్నట్లు, ఆస్థులు పంచాలని కొడుకులు కోడలు వేధిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు విచారించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా స్టేషన్ డీఎస్పీ కె రామారావు, లీగల్ అడ్వైజర్ టి. శ్రీనివాసులు రెడ్డి కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు మాదక ద్రవ్యాల వాడకానికి దూరంగా వుండాలి

**రాపూరు, ఆగష్టు11ప్రభాతవార్త :** విద్యార్థులు మాదక ద్రవ్యాల వాడకానికి దూరంగా వుండాలని రాపూరు ఎస్ఐ యం. వెంకట రాజేష్ కోరారు. సోమవారం రాపూరులోని సివికె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్స్‌పాల్ బి. క్రిష్ణవేణి ఆధ్యక్షతన నిర్వహించిన మాదక ద్రవ్యాల మీద, ఫోక్సా చట్టంపై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గోని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్దాలను వివరించారు. ఈ చెడు వ్యసనాలకు దూరంగా వుండి విద్యార్థులు వారి చదువుపై దృష్టి సారించి ఉన్నత స్దానాలకు చేరుకోవాలని కోరారు. అలాగే కళాశాలలో ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ వంటి వాటికి పాల్పడితే వారి భవిష్యత్ నాశనం అవుతుందని అందువల్ల వాటికి కూడా దూరంగా వుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి జి. సాయికిరణ్, ఆధ్యాపక, ఆధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గోన్నారు.

## ఫకీరయ్య దాతృత్వం వెలకట్టలేనిది



**వింజమూరు, ఆగష్టు 11, ప్రభాతవార్త :** సమాజంలో ఎంతో మంది ధనవంతులు ఉంటారు కానీ వారిలో దయాగుణం కలవారు అదురుగా ఉంటారు. తోటి మనుషులు బాధపడుతుంటే తన మనసుకు బాధ కలుగుతున్నట్లు భావించే వ్యక్తులు కొందరు ఉంటారు. వారి బాధను పంచుకోవాలని ఆలోచన కలిగిన వారిలో గడ్డం ఫకీరయ్య ఒకరు. తాను గతంలో అనేక మంది పేదలను ఆదుకున్నారు. అయ్యా సాయం కావాలని అడిగితే తనకు ఉన్న దానిలో కొంతైనా అందించి సాయపడే గుణం కలవాడు. అదే క్రమంలో వింజమూరు జీబీకేఆర్ ఎస్‌టీ కాలనీకి చెందిన వృద్దురాలైన పోలమ్మకు పేదరికంగా ఉండి కనీసం దృద్దాప్య పింఛన్ కూడా రాకపోవడంతో పూట గడవడమే కష్టంగా ఉన్న తరుణంలో ఈ విషయం ఫకీరయ్య దృష్టికి రాగా ఆయన ఆమె స్వగృహానికి వెళ్లి ఉడతా భక్తిగా రూ. 5వేలు నగదు, బియ్యం బస్తా, నూనె, పప్పులు ఇచ్చి ఆదుకున్నారు. భగవంతుడు ఇచ్చిన దానిలో ఎంతో కొంత పేదవారిని ఆదుకోవాలని ఆలోచన గొప్ప విషయమని పలువురు కాలనీ వాసులు ప్రశంసించారు. భవిష్యత్తులో మరింత మందిని ఆదుకునే విధంగా భగవంతుడు ఆయనకు శక్తిని ఇవ్వాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీవీ రిపోర్టర్ మాధవ, వార్త రిపోర్టర్ ఎస్.నరసింహా, ఎన్ త్రి రిపోర్టర్ ఆర్.రాము, ప్రైమ్ నైన్ రిపోర్టర్ రాజేష్, యాక్ట్ రిపోర్టర్ సురేష్ తదితరులు ఉన్నారు.

## సారద్యం సభను విజయవంతం చేయాలి



**కావలి, ఆగష్టు 11, ప్రభాతవార్త:** ఈనెల13వతేది బుధవారం నెల్లూరులో నిర్వహించనున్న భారతీయ జనతాపార్టి రాష్ట్ర అద్యక్షుడు పివిఎన్ మాధవ్ సారద్యం యాత్ర సభను విజయవంతం చేయాలని కావలి పట్టణ బిజెపి నాయకులు తెలిపారు. భారతీయజనతాపార్టి కావలి పట్టణశాఖ ఆద్యర్యంలో ఒకటవ పట్టణ అద్యక్షుడు మందా కిరణ్‌కుమార్ అద్యక్షతన సోమవారం పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు .ఈసమావేశంలో బిజెపి నాయకులు మాట్లాడారు.నెల్లూరులో జరిగే సారద్యంసభకు జనసమీకరణ, శోభాయత్రగూర్చి చర్చించారు.పట్టణంలోని అన్నివార్డులలోని కార్యకర్తలు బూత్‌కమిటి అద్యక్షులు, నాయకులు పాల్గొనాలని పిలుపునాచ్చారు.స్వాతత్ర్యంవచ్చి 75సంవత్సరాలు పూర్తయిన సందర్భంగ ఆజాది కాఅమృత్ మహోత్సవంలో భాగంగ కేంద్రప్రభుత్వం హర్‌ఘర్‌తిరంగ కార్యక్రమాన్ని చేపట్టిందని చెప్పారు. ఈనెల13వతేదినుంచి ప్రతిఇంట ప్రజలు జాతాయజెండాను ఎగురవేసి ఈఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఇంటిపై ఎగురవేసే జాతీయ జండాతో ఫోటోలు,సెల్ఫీలుదిగి హర్‌ఘర్ తిరంగకంలో అప్‌లోడ్‌చేయాలని తెలిపారు.ఈకార్యక్రమంలో బిజెపి సీనియర్‌నాయకుడు వింత రంగారెడ్డి,జిల్లా టెలికమ్ అద్వయ్‌జరీ కమిటి సబ్యులు కుట్టుబోయినబ్రహ్మానందం,జిఎస్‌టి మండలి సభ్యులు అమర వెంకటసు బ్బారావు,పరసు వెంకటేశ్వర్లు,జిల్లా ఉపాద్యక్షురాలు పూనూరు మాధవిరెడ్డి,మద్దిశెట్టి నరేంద్ర,పట్టణ ప్రధానకార్యదర్శి గుడిపల్లి ప్రసన్నకుమార్‌తూమాటి తిరుపతిస్వామి,వాయిగండ్ల వెంకటసుదీర్,ముంగమూరు వెంకటరెడ్డి,ఉప్పాల ఎల్లయ్య,పసుపులేటి సుధాకర్,కామినేని ఉదయలక్ష్మి ,దేవాండ్ల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## దిమిశెట్టి మరణం వ్యక్తిగతంగ తీరనిలోటు: మాజీ ఎంఎల్ఏ కాటంరెడ్డి



**కావలి, ఆగష్టు11,ప్రభాతవార్త:** డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాలచైర్మన్ సీనియర్ నాయకులు దామిశెట్టి శ్రీనివాసులనాయుడు మరణం వ్యక్తిగతంగ తీరనిలోటని మాజి ఎంఎల్ఏ కాటంరెడ్డి విష్ణువ ర్ధన్‌రెడ్డి అన్నారు.దామిశెట్టి శ్రీనివాసులనాయుడు ఇటీవల మృతిచెందాడు.వారి కుటుంభసభ్యులను వారి నివాసంలో విష్ణువర్ధన్‌రెడ్డి పరామర్శించారు.ఈసందర్భంగ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లా డారు. శ్రీనివాసులనాయుడు ఎంతో కాలంగ వ్యక్తిగత పరిచాయాలతో వున్న వ్యక్తని ఇపుడులేకపోవడం భాదాకరమన్నారు.వారి కుటుం భసభ్యులు ధైర్యంగ వుండాలని సానుబూతిని తెలిపారు.శ్రీనివాసులనాయుడు పవిత్రాత్మకు శాంతి చేకూరా లని కోరుకుంటున్నామన్నారు.ఆయన తనయుడు సుధీర్‌నాయుడు ధైర్యంగవుండి కుటుంభసభ్యులకు అండగ వుండాలని కోరారు.ఈకార్యక్రమంలో నాయకులు గోసలగోపాలరెడ్డి,పాలవల్లి పద్మనాభరెడ్డి,అనంతం బాలకృష్ణంరాజు,మోహన్‌రావు,పప్పు సుధాకర్,బిసి ఐక్యతాభవన్ రాష్ట్ర అద్యక్షుడు అద్దంకి ప్రభాకర్ ప్రధానకార్యదర్శి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కర్లపాలెంలో శ్రీరాముల వారి ఆలయ నిర్మాణానికి భూమి పూజ
## కార్యక్రమానికి హాజరైన ఇంటూరి సౌజన్య



**గుడ్లూరు (కందుకూరు) ఆగస్టు 11 ప్రభాతవార్త:** గుడ్లూరు మండలం, సాలిపేట పంచాయతీ పరిధిలోని కర్లపాలెం గ్రామానికి చెందిన ఆర్ అండ్ ఆర్ కాలనీ కొత్తగా నిర్మించనున్న శ్రీరాముల వారి ఆలయానికి సోమవారం భూమి పూజ కార్యక్రమం వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమానికి కందుకూరు సబ్ కలెక్టర్ లు తిరుమణి శ్రీ పూజ, దామెర హిమవంశీ తో కలిసి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య , కుమారుడు సందీప్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.గ్రామ ప్రజలందరి సహకారంతో, దాతల ఆర్థిక సహాయంతో ఆలయ నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య భూమి పూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.ముందుగా ఇంటూరి సౌజన్య కి గ్రామస్తులు మహిళలు ఘన స్వాగతం పలికారు..ఈ కార్యక్రమంలో గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, పార్టీ నాయకులు గద్దగుంట శ్రీనివాసులు, చిత్తారి మల్లికార్జున మేకల మాల్యాద్రి, షేక్ బాబు, మద్దసాని శ్రీనివాసులు,పోలుగంగు కృష్ణ అత్తింటి శ్రీనివాసులు, కల్లూరి శైలజ, జొన్నలగడ్డ రమణమ్మ అల్లం సుమతి, సింగమనేని పద్మ మరియు గ్రామస్తులు మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## తహసిల్దారును సత్కరించిన లింగసముద్రం టిడిపి నాయకులు



**లింగసముద్రం ఆగస్టు 11 ప్రభాతవార్త:** లింగసముద్రం మండలం తహసిల్దారుగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎం. కోటేశ్వరరావును తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు పూరిమిట్ల గురునాథం మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం తహసిల్దార్ కార్యాలయంలో ఆయనను కలిసి శాలువాలతో సత్కరించారు. సందర్భంగా మండలంలో ఉన్న పలు సమస్యలను గురునాథం ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రత్యేక దృష్టి పెట్టి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు ఈయన వెంట లింగసముద్రం గ్రామ టిడిపి అధ్యక్షులు గాలంకి ప్రసాద్ ఉన్నారు.

## పోలీసులకు డ్రోన్ కెమెరాను బహూకరించిన యోధ
## డయాగ్నస్టిక్స్ అధినేత కంచర్ల సుధాకర్



**కందుకూరు ఆగస్టు 11 ప్రభాతవార్త:** సంఘవిద్రోహశక్తులు మీద, అసాంఘిక కార్యకలాపాల మీద నిఘా ఉంచడానికి ఉపయోగపడే రూ.1,50,000/ విలువ చేసే డ్రోన్ కెమెరాను యోధ దయగ్నోస్టిక్స్ అధినేత అయిన కంచర్ల సుధాకర్ తండ్రి కంచర్ల వెంకటేశ్వర్లు ద్వారా సోమవారం కందుకూరు డిఎస్పి సిహెచ్.వి.బాలసుబ్రమణ్యం కి అందజేసినారు. శాంతి భద్రతల పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా డ్రోన్ కెమెరాను అందజేసిన కంచర్ల సుధాకర్ ని డిఎస్పీ అభినందించారు ఈ సందర్భంగా సుధాకర్ తండ్రిని డి.ఎస్.పి చిరు సన్మానంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సిఐ షేక్ .అన్వర్ బాషా ,గుడ్లూరు సిఐ జి.మంగారావు, కందుకూరు పట్టణ ఎస్ఐ పులి శివ నాగరాజు పాల్గొన్నారు.

## కడలూరు అక్రమ కారైల్ బోట్లు వేట సమస్యలు పరిష్కరించండి

**కావలి, ఆగష్టు11ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్టంలో వున్న మత్స్యకార తీర ప్రాంతాలలో అక్రమంగా ప్రవేశించిన కడలూరు కారైల్ బోట్లలో వేటకు వస్తున్న ఇతర రాష్టాల వారి నుంచి వస్తున్న సమస్యలను పరిష్కరించాలని బీసి ఐక్యత భవన్ రాష్ట్ర అధ్యక్షులు అద్దంకి ప్రభాకర రావు, గౌరవాధ్యక్షులు ఉరిటి గోవిందు, ప్రధాన కర్యాదర్శి చిన్ని వరప్రసాద రావులు సోమవారం కావలి ఆర్డీఓకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట బీసి నాయకులు మాట్లాడుతూ భారతదేశంలో సముద్రతీరం వున్న రెండో రాష్టంగా ఆంధ్రప్రదేశ్ వుండటంతో బడుగు, బలహీన వర్గాల మత్స్యకారులు సముద్ర వేటకు వెల్లి ఉపాధి పొందుతున్నారని, తమిళనాడుకు చెందిన కడలూరు, కర్తల్ బోట్టు వచ్చి అనరకమంగా వేట చేస్తూ అంధ్రప్రదేశ్ మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీస్తున్నారన్నారు. దీనిపై పలుమార్లు మత్స్యకారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెల్లినా పలితం లేకుండా వుందన్నారు. దీంతో ఎపి మత్స్యకారులు ఆవేదనకు గురైతున్నారన్నారు. రెండు రాష్టాలకు సంబందించిన సమస్యలు పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని వారు కోరారు. మత్సకారుల ఉపాధి దెబ్బతీస్తున్న తమిళనాడుకు చెందిన బోట్లను ఆంధ్రప్రదేశ్‌లోకి రాకుండా అధికారులు చూడాలని ఒకవేళ వస్తే కేసులు పెట్టి కఠనింగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరి,ఉదయ్ కుమార్ తదితరులున్నారు.

## కావలి పిఎసిఎస్ అధ్యక్షునిగా కాటా బాస్కర రెడ్డి



**కావలి, ఆగష్టు11ప్రభాతవార్త :** కావలి పిసిఎస్ అధ్యక్షునిగా కాటా బాస్కర రెడ్డిని నియమిస్తూ రాష్ట ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణా రెడ్డి అశీస్సులతో అధ్యక్షునిగా కాటా బాస్కర రెడ్డి, సభ్యులుగా సోమయ్య గారి రమణ, కమతం ప్రసాద్‌లను ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా అధ్యక్షుడు కాటా బాస్కర రెడ్డి మాట్లాడుతూ తమపై నమ్మకంతో అధ్యక్షునిగా తనను నియమించిన కావలి ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట క్రిష్ణా రెడ్డికి ధన్యవదాలు తెలిపారు. పిసిఎస్ అభివృద్ధికి ఎమ్మెల్యే సహకారంతో కృషి చేస్తానని తెలిపారు.

## వైభవంగా మహా శాంతి హోమం



**కోవూరు , ఆగస్టు 11 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో స్వామివారి పవిత్రోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మహా శాంతి హోమం, అగ్ని గుండాలకు పవిత్రాల సమర్పణ, విశేష హోమాలను సాంప్రదాయ బద్దంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి పూలంగి సేవ, పల్లకి సేవ కార్యక్రమాలను కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు శ్రీకాంతాచార్యులు, రాఘవాచార్యులు, కృష్ణమాచార్య స్వామి, సుబ్బయ్య స్వామి, నందకుమార్ స్వామి, ఫణీంధ్ర స్వామి, భక్తులు ఉన్నారు. భక్తులు ఉన్నారు.

## కోటి తీర్ధం చాపల చెరువును పరిశీలించిన జెసి



**చేజర్ల ఆగష్టు 11 ప్రభాతవార్త :** చేజర్ల మండలం కోటి తీర్దం గ్రామంలోని చాపల చెరువును సోమవారం జిల్లా జాయింట్ కలక్టర్ కె.కార్తిక్ పరిశీలించారు.చేపల చెరువు విషయమై అందిన ఫిర్యాదు మేరకు దానిని పరిశీలించారు.కోటి తీర్దం గ్రామంలోని కొంతమంది రైతులు ఎలాంటి అనుమతులు లేకుండా చాపల చెరువులు పెంపకం సాగించడం వల్ల చుట్టుపక్కల రైతులకు నష్టం వాటిల్లుతుందని చేపల చెరువు వేస్టు వాటర్ తమ పొలాలలకు చేరి ఎలాంటి పైరు లు సాగు చేయలేకపోతున్నామని ఆగ్రామానికి చెందిన కొంతమంది రైతులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తిక్,ఆత్మకూరు ఆర్‌డిఓ బి .పావనీ పరిశీలించారు. చేపల చెరువు భూములను పరిశీలించి తగు నివేదిక ఇవ్వాలని సంబందిత ఆత్మకూరు, చేజర్ల అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో చేజర్ల తహసిల్దారు బి .మురళీ, ఇరిగేషన్ అధికారులు, మత్యశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## చేజర్ల పిఏసిఎస్ చైర్మన్‌గా వీరరాఘవరెడ్డి



**చేజర్ల ఆగష్టు 11 ప్రభాతవార్త :** చేజర్ల మండల ప్రాథమిక వ్యవసాయ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా చేజర్ల గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీనాయకులు బూదళ్ళ వీరరాఘవరెడ్డిని నియమించారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారి చేసింది. గతంలో కూడా సొసైటీ అద్యక్షులుగా పనిచేసిన అనుభవం ఉంది. మరోకసారి సొసైటీ చైర్మన్‌గా ఎంపిక కావడం పట్ల రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, తెలుగుదేశం పార్టీ సీనియర్‌నాయకులు తాళ్లూరు గిరినాయుడుకి ధన్యవాదాలు తెలిపారు.సొసైటీ సభ్యులుగా వావిలేరు గ్రామానికి చెందిన మదమంచి సుధీర్‌కుమార్, నడిగడ్డ అగ్రహారానికి చెందిన ఆరెద్దుల రామకృష్ణయ్యను నియమించారు. రైతులు అభివృద్ధికి కృషి చేస్తానని వారు తెలిపారు.

## పీఎం జన్ మన్ కింద ఏపీలో 87 హాస్టల్స్



Status of implementation of PM JANMAN in Andhra Pradesh, year-wise and district-wi

| Sl. No. | District | Year wise number of hostels approved | | |
|---|---|---|---|---|
| | | 2023-24 | 2024-25 | 2025-26 |
| 1. | Srikakulam | 02 | 01 | 01 |
| 2. | Nandyala | 02 | 01 | 0 |
| 3. | Manyam | 0 | 02 | 0 |
| 4. | Alluri Sitharama Raju | 0 | 0 | 53 |
| 5. | Parvathipuramanyam | 0 | 0 | 22 |
| 6. | Eluru | 0 | 0 | 02 |
| 7. | Palnadu | 0 | 0 | 01 |
| | TOTAL | 04 | 04 | 79 |

Source: AWP&B 2023-24, 2024-25 and 2025-26

**నెల్లూరు రూరల్, ఆగస్టు 11, ప్రభాతవార్త :** ప్రధానమంత్రి జన్ మన్ కింద ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 87 హాస్టళ్లను కేటాయించినట్లు కేంద్ర విద్యా శాఖా సహాయ మంత్రి జయంత్ చౌదరి తెలిపారు. లోకసభలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారి ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. సోమవారం పీఎం జన్ మన్ పథకం పై ఎంపి వేమిరెడ్డి పలు ప్రశ్నలు వేశారు. ఆంధ్రప్రదేశ్‌లో పథకం అమలు స్థితిపై ఆరా తీశారు. ప్రాజెక్టుల సమయం, ఖర్చు పెరుగుదల, గడువు వివరాలు కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలకు కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. ప్రధాన మంత్రి జన్ జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పిఎం జన్ మన్) అనేది గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రధాన కార్యక్రమం అని చెప్పారు. ఈ పథకం అమలులో భాగంగా సమగ్ర శిక్ష కింద 500 హాస్టళ్ల నిర్మానానికి విద్యా మంత్రిత్వ శాఖ ఒక కార్యాచరణ అమలు చేస్తోందన్నారు. 2023 – 24 నుండి, 17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో పిఎం జన్మాన్ కింద 492 హాస్టళ్లు ఆమోదించబడ్డాయని వివరించారు. పిఎం జన్మాన్ కింద ఆంధ్రప్రదేశ్ కోసం 87 హాస్టళ్లు ఆమోదించబడ్డాయని తెలిపారు. ఈ పథకం కింద నిధులు సమగ్ర శిక్ష పథకం నిబంధనల ప్రకారం మరియు ఆర్థిక మంత్రిత్వ శాఖ ఎప్పటికప్పుడు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం విడుదల చేయబడతాయి. అభియాన్ కాలం 2023 – 24 నుండి 2025 – 26 వరకు ఉంటుందన్నారు. నేటికి, ఎటువంటి జాప్యాలు లేదా ఖర్చు పెరుగుదల లేదని వివరించారు.

## నెల్లూరు నగర అభివృద్దిలో భాగస్వాములు కండి

**– ఆర్యవైశ్య నేతలకు వేమిరెడ్డి పిలుపు**



**నెల్లూరు, ఆగష్టు 11, ప్రభాతవార్త –వైద్యం :** రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ నేతృత్వంలో అభివృద్ధి పథంలో నడుస్తున్న నెల్లూరు నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధతో కలిసి సోమవారం అర్బన్ ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నేత ముక్కాల ద్వారకానాథ్‌తో పలు అంశాలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన పీ 4 లో భాగంగా మంత్రి నారాయణ సూచనలు మేరకు నెల్లూరును మరింత వేగంగా అభివృద్ధి పరి చేందుకు భాగస్వాములు కావాలని, నిరుపేదలు చదివే ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు ముందుకు రావాలని ముక్కాలను కోరారు. సానుకూలంగా స్పందించిన ఆర్యవైశ్య నేతలు, ఆర్యవైశ్యులు ప్రభుత్వానికి ఎల్లప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. సహచర నేతలతో చర్చించి త్వరలో తమ నిర్ణయాన్ని ప్రకటిస్తామని ముక్కాల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళ నేతలు పాల్గొని వేమిరెడ్డిని ఘనంగా సత్కరించారు.

## గుడిపల్లి కాలువలో గుర్తు తెలియని మృతదేహం



**బుచ్చి ఆగష్టు 11 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీలోని సుబ్బారెడ్డినగర్‌లో గుడిపల్లి కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ప్రజలు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు.విషయం తెలిసన వెంటనే ఎస్ఐ సంతోష్‌రెడ్డి సంఘటనా స్దలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు మద్యం మత్తులో గుడిపల్లి కాలువలో పడి పోయి వుండవచ్చునని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టరంకి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పాఠశాల ఆవరణంలో కోనోకార్పస్ చెట్లు తొలగించండి



**సంగం ఆగష్టు 11 ప్రభాతవార్త :** సంగం మండలంలోని గాంధీ జనసంఘం పంచాయితీలో ఉన్న ప్రభుత్వ, అంగన్ వాడీ స్కూల్, ప్రభుత్వ ఎలిమెంట్రీ స్కూల్ నందు కోనో కార్పస్ 15 చెట్లుపైగా ఉన్నాయని వాటిని తొలగిం చాలని జనసేన పార్టీ నాయకులు చిరం జీవి యువత అద్యక్షులు దాడి భాను కిరణ్ గాందీజనసంఘం నాయకులను కలుపు కొని ప్రభుత్వ స్కూలుకి వెళ్ళి ప్రధానోపాద్యాయులుకి చెట్లు తొలగించమని వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బాను కిరణ్ మాట్లాడుతు ఆంధ్రప్రదేశ్ డిప్యూటి సిఎం కొణిదెల పవన్ కళ్యాణ్ సూచనల మేరకు, జిల్లా జనసేనన పార్టీ పర్యవేక్షకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టిట్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ ఆదేశాల మేరకు ఈ చెట్లను తొలించే ప్రయత్నం చేస్తున్నట్లు వారు తెలిపారు. కోనో కార్పస్ చెట్లు వల్ల శ్వాసకు సంబందించిన వ్యాధులు,భూగర్భ జల సంపద మరియు ఆరోగ్యం మీద చాలా తీవ్ర ప్రమాదం చూపుతుందని వారు పేర్కున్నారు. ఎంఇఒ,అధికారులు స్పందించిన పక్షంలో జనసేన పార్టీ తరపున చెట్లను తొలగించే కార్యక్రమం సంగం జనసేన పార్టీ చేస్తుందని వారు తెలిపారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కృష్ణ, గాందీజనసంఘం పార్టీ జనసేన పార్టీ నాయకులు పొట్లూరి వినయ్, ఇంద్ల భాను చంద్ర, పులి వెంకటేష్, చైతన్య తదితరులు పాల్గోన్నారు.

## 12 నుండి నులుపురుగుల నివారణ కార్యక్రమం



**సీతారామపురం ఆగష్టు 11 ప్రభాతవార్త :** జాతీయ నులుపు రుగులు నివారణ కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని ఎంపి డిఒ ఎం సాయి ప్రసాద్ అధికారు లకు ఈనెల 12 వ తేది మంగ ళవారం సీతారామపురం మండల లోని అన్ని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలో నిర్వహించబోయే జాతీయ నిలుపురుగుల నివారణ కార్యక్రమంపై మండల స్దాయి అధికారులతో సమావేశం నిర్వహించి గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతు సీతారామపురం మండలంలోని 42 ప్రభుత్వ,3 ప్రవేటు పాఠశాలలు 42 అంగన్‌వాడీ పాఠశాలలోని 3504 మంది పిల్లలు విద్యార్దులకు మంగళవారం డివార్మింగ్ కార్యక్రమం విజయవంతం చేయడానికి విద్యార్దుల తల్లిదండ్రులకు సందేశాలను అందించాలని ఆదేశించామని అన్నారు. ఆల్‌బెండ్‌జోల్ మాత్రలు తీసుకోవడం వలన విద్యార్దులలో రక్తహీనత జరుగుతుందని అన్నారు. చదువు మీద ఏకగ్రత పెరుగుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో ఎంఇఒ ఎస్‌కె.మస్తాన్ వలీ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఏ స్వప్న రెడ్డి, తహసిల్దారు కృష్ణారెడ్డి, ఎంపిహెచ్ఇఒ మజిద్, పంచాయితీ కార్యదర్శి రాంనాద్‌రెడ్డి, తదితరులు పాల్గోన్నారు.

## లారీ ఛార్జ్ చేసిన సీఐపై చర్యలు చేపట్టండి : ఎస్ఎఫ్ఐ డిమాండ్

– కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టిన ఎస్ఎఫ్ఐ

**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 11, ప్రభాతవార్త :** యువజన సంఘం నాయకులపై లాఠీ చార్జి చేపట్టిన ఐదవ పట్టణ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌ని సస్పెండ్ చేయాలని సోమవారం ఎస్ఎఫ్ఐ నాయకులు వి నరేంద్ర ఎన్వి రమణ షేక్ మస్తాన్ లు పలువురు ఎస్ఎఫ్ఐ నాయ



కులతో కలిసి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ఆర్ఎన్ఆర్ కళాశాలలో సీజ్ చేయాలన్నారు ఆర్ఎన్ఆర్ హాస్టల్ విద్యార్థిని అనుమానాస్పద మృతిపై విచారణ జరిపించాలన్నారు యువజన సంఘం నాయకులపై లాఠీచార్జి చేసినా ఐదవ పట్టణ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సస్పెండ్ చేయాలని వారు నినాదాలు చేశారు అనంతరం జేసి కార్తీక్ వినతి పత్రం సమర్పించారు హేమ శ్రీ అనుమానాస్పద మృతికి నిరసనగా తాము నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటే ఐదో పట్టణ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ విచక్షణా రహితముగా లాఠీచార్జి చేయడం అన్యాయం అన్నారు నిబంధనల మేరకు కళాశాలను కళాశాలలను నిర్వహి ంచడం లేదన్నారు నిబంధనలను పాటించని కాలేజీలపై చర్యలు చేపట్టాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కాలేజీ నడుపుతున్నఆర్ ఎన్ ఆర్ కాలేజీని వెంటనే సీజ్ చేయాలన్నారు సర్కిల్ ఇన్స్పెక్టర్ పై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయాన్ని నగరంలో ఏర్పాటు చెయండి

– అందులకు సూపర్ సిక్స్ మంజూరు చేయండి

– అందుల సమైక్య ఆధ్వర్యంలో జేసీకి, దివ్యాంగులు వినతి



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 11, ప్రభాతవార్త :** సూపర్ సిక్స్ మంజూరు చేయాలని జిల్లా అందుల సమైక్య అధ్యక్షుడు ఎస్.కె జకావుల్లా సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కొన్ని డిమాండ్లు ముందుకు తీసుకొని వచ్చారు దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయాన్ని నెల్లూరులో ఏర్పాటు చేయాలని అది నగరానికి దూరంగా ఉండడంతో, తమకు రాకపోకలకు చాలా ఇబ్బంది అవుతుందని తమ సమస్యలపై కార్యాలానికి వెళ్లాలంటే, రెండు మూడు ఆటోలు మారాల్సి వస్తుందని దివ్యాంగులందరికీ ఇండిపెండెంట్ రేషన్ కార్డు మంజూరు, సబ్సిడీ రుణాలు మంజూరు, దివ్యంగులకు మాత్రమే ఉద్యోగాలు ఇవ్వాలని, దివ్యాంగులకు శాశ్వత ఉపాధి కల్పించాలన్నార. మరియు శాశ్వత గృహాలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నారు. అన్ని రకాల బస్సులలో ప్రయాణించేందుకు బస్సు పాసులు సరడీకృతం చేయాలన్నారు. డిచార్జిబుల్ అన్ని కార్యాలయంలో అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు జకావుల్లాతో పాటు మస్తాన్, కేశవులు, సనావుల్లా జిలాని, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసి బస్సులకు ఆన్‌కాల్ డ్రైవర్ల నియామకాలు: డిపో మేనేజర్



**ఆత్మకూరు, ఆగస్టు11,ప్రభాతవార్త :** ఆత్మకూరు పట్టణంలోని ఆర్టీసి డిపో పరిధిలో ఆన్‌కాల్ పద్ధతిలో ఆర్టీసి బస్సులకు డ్రైవర్లుగా చేసేందుకు హెవీ లైసెన్సు ఉండి 18నెలల పాటు వాహనం నడపడంలో అనుభవం ఉండి 39సంవత్సరాల లోపు వ్యక్తులు అవసరమని అటువంటి అర్హతలున్నవారు ఆత్మకూరు ఆర్టీసి డిపో కార్యాలయంలో తమ పేరును నమోదు చేసుకొని వారు సూచించిన విధంగా సూచనలు పాటించాలని డిపో మేనేజర్ తెలిపారు. ఆన్‌కాల్ పద్ధతి అనగా అవసరమైన సమయంలో ఫోన్ చేసి విధులకు తీసుకోవడం అని పైన తెలిపిన విధంగా అర్హతలుండి ఆసక్తి ఉంటే ఆన్‌కాల్ ఆర్టీసి డ్రైవర్‌గా చేరవచ్చని శివకేష్ యాదవ్ తెలిపారు.

## ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కరిస్తా: మాలేపాటి రవీంద్ర



**దగదర్తి, ఆగష్టు 11, ప్రభాతవార్త :** సమస్య అంటూ తన వద్దకి వచ్చిన ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కరిస్తానని మాలేపాటి రవీంద్ర నాయుడు అన్నారు. సోమవారం మాలేపాటిని తన నివాసంలో పలువురు మండల ప్రజలు అధిక సంఖ్యలో సమస్యలను తెలుపుకున్నారు. రవీంద్ర అన్నా మాకష్టాలు విను అంటూ ఎన్నో సమస్యలతో వాపోయారు. ఈ సందర్భంగా ప్రతి వ్యక్తిని ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అర్జీ రూపంలో నమోదు చేసుకుని ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కరిస్తానని మాలేపాటి హామీ ఇచ్చారు. పెన్షన్ మంజూరు కాలేదని పట్టాదారు పాసు పుస్తకాల సవరణ విషయంలో జాప్యం జరుగుతుందని అడిగిన వారి సమస్యలపై వెంటనే స్పందిస్తూ.. అధి కారులతో ఫోన్లో మాట్లాడి ఆయా సమస్యలను పరిష్కరించారు. గృహ నిర్మాణాలకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని మహిళలు కోరగా సానుకూలంగా స్పందించి తన సొంత నిధులతో సిమెంటు, రేకులు అందించడం జరిగింది. సాధారణ జీవితాన్ని గడపడం కష్టతరంగా ఉన్న కొన్ని కుటుంబాల మహిళలకు ఆర్థికంగా చేయూతను అందించారు. అనంతరం దగదర్తి మండలంలోని పలు గ్రామాల తెలుగుదేశం పార్టీ నాయకులు ఆయనను కలిసి గ్రామ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. అత్యధిక సంఖ్యలో వచ్చిన మహిళలకు, తెలుగుదేశం పార్టీ శ్రేణులకు, అర్జీదారులకు అక్కడే భోజనం ఏర్పాటు చేసి అందరితో కలిసి భోజనం చేశారు.

## తహసీల్దార్ సత్కరించిన నోటి ప్రసాద్‌రెడ్డి



**కావలి, ఆగష్టు11,ప్రభాతవార్త:** కావలి డివిజన్ రెవెన్యూ ఆసోసియేషన్ అద్యక్షుడిగ ఎన్నికైన కావలి తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌ను సోమవారం కాంట్రాక్టర్ నోటి ప్రసాద్‌రెడ్డి తహసీల్దార్‌కార్యాలయంలో కలసి ఆయనను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి స్వీట్సు పంచిపెట్టారు. ఈ సందర్భంగానోటి ప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. ప్రజలు,అదికారులతో మంచి సంబందాలున్న తహసిల్‌దార్ శ్రావణ్ కుమార్‌కావలి డివిజన్ రెవెన్యూ అసోసియేషన్ అద్యక్షుడిగ ఎంపికైన సందర్బంగ శుభాకాంక్షలు తెలిపామన్నారు. ప్రజల సమస్యలు పరిష్కారంలో తనవంతు కృషిచేయాలని కోరారు.

## అన్యాక్రాంతమైన భూమిని అప్పగించండి



**బిట్రగుంట ఆగష్టు 11 ప్రభాతవార్త:** బోగోలు మండలంలోని జువ్వలదిన్నె గ్రామం (రామచం ద్రపురం) ప్రదేశంలోని శ్రీ పెనుగొండ అమ్మవారి దేవస్థానం ఆలయ అభివృద్ధి కోసం పూర్వీకులు విరాళంగా ఇచ్చిన 25 ఎకరాలు అన్యాక్రాంతమై ఉన్నదని దానిని విడిపించి దేవస్థానానికి అప్పగిం చాలని మండల తాసిల్దార్ శ్రీనివాసులు రెడ్డికి మండల టిడిపి కన్వీనర్ ఎం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు కలిసి వినతిపత్రం సమ ర్పించారు. సర్వే నంబర్లు 292,298,300, 303,304,305,306, 403 లలో ఉన్నదన్నారు. దీనిని ఖాళీ చేయమంటే దౌర్జన్యం కు దిగుతున్నారని ఆవేదన చెందుతున్నారు.

## గోమాతలపై దూసుకెళ్లిన మినీ టిప్పర్



**ఉదయగిరి, ఆగష్టు 11, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఉదయగిరిలోని గండిపాలెం మార్గంలో సోమవారం గోమాతలపై దూసుకెళ్లింది. ఒక లేగ దూడ అక్కడికక్కడే మణించగా మరొక ఆవు తీవ్రంగా గాయపడి ప్రాణాలతో కొట్టమిట్టాడుతుంది. మద్యం సేవించి వాహనం నడపటమే కారణమని స్థానికులు అంటున్నారు. మరో పక్క ఆవు ట్రక్కు చక్రాలలో ఇరుక్కోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. చక్రాలలో ఇరుక్కును ఆవును స్థానికులు అతి కష్టం మీద బయటకు తీయగలిగారు. పశువుల యజమానులు పశువుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అలాగే వాహనాలు నిడిపేటప్పుడు వాహనదారులు జాగ్రత్తలు వహించాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

## జలదంకి సొసైటి అద్యక్షుడిగ కరియావుల



**జలదంకి, ఆగష్టు11, ప్రభాతవార్త:** జలదంకి ప్రాదమిక వ్యవసాయ పరపతిసంఘం ఛైర్మన్‌గ కరియావుల అప్పలనాయుడు నియమితులయ్యాడు. ఈమేరకు టిడిపి కేంద్రకార్యాలయంనుంచి ప్రకటనవిడుదలైంది. అప్పలనాయుడు మండలపరిది లోని కమ్మవారిపాళెం వాసి. తెలుగుదేశంపార్టి సీనియర్‌నాయకుడు. మండలంలో పార్టీ బలోపేతానికి నిత్యకృషీవలుడైన కరియావులకు సొసైటి ఛైర్మన్ పదవి కట్టబె ట్టడంపై మండలపార్టి హర్షంవ్యక్తంచేసింది. పార్టి మండల అద్యక్షుడు పులిగుంట మధుమోహన్‌రెడ్డి,సీనియర్ నేతలు ఈ సందర్బంగ అప్పలయ్యనాయుడికి అభినం దనలు తెలిపారు. రైతు సమస్యలు,వారి కష్టనష్టాలు సంపూర్ణంగ ఎరిగిన రైతు పక్షపాతికి సరైన సమయంలో తగిన పదవి దక్కడంపై అందరు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇది మంచిప రిణామంగ కొనియాడారు. ఈసందర్బంగ అప్పలనాయుడు మాట్లాడుతు తనకు పిఎసిఎస్ ఛైర్మన్ పదవి వచ్చేందుకు కృషిచేసిన ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్‌కు కృతజ్ఞతలు తెలియ జేశాడు. తనపై నమ్మకముంచి గురుతర భాద్యతలను అప్పగించిన వైనాన్ని గుర్తెరిగి పదవికి వన్నెతెస్తానని అలాగే రైతులకు అందుబాటులోవుండి వారి సేవలో తరిస్తానని అప్పలయ్యనాయుడు తెలియ జేశాడు.

## స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా



**జలదంకి, ఆగష్టు11, ప్రభాతవార్త:** విద్యుత్ రంగ ప్రవేటు కంపెనీల చేతుల్లోకి అప్పగించే క్రమంలో స్మార్ట్‌మీటర్ల బిగింపుకు వ్యతిరేకంగ సోమవారం స్థానిక విద్యుత్ ఉపకేంద్రం ఎదుట సిపిఎంపార్టి ఆద్వర్యంలో దర్నా కార్యక్రమం నిర్వహించారు. ఎర్రజెండాలు చేబూని వామపక్షాల నేతలు ఉదయం సబ్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. పెద్దపెట్టున నినాదాలు చేశారు. స్మార్ట్‌మీటర్లను వెంటనే రద్దుచేయాలని నినదించారు. విద్యుత్ వినియోగదారులపై భారంమోపే ఈనిర్ణయాన్ని వెనక్కితీసుకోవాలి, మండలంలో కరంటు అంతరాయాన్ని ఆపాలి వంటి నినాదాలతో గళమెత్తారు. ఈసంద ర్బంగ నాయకులు టిమాల్యాద్రి,రావి మాల్యాద్రి,గడ్డం మాల్యాద్రి,మేలంగి ఆంతోనిబాబులు మాట్లా డారు. కేంద్రప్రభుత్వ విధానాలపై మండిపడ్డారు. ఈ పాపాలన్నింటికి ప్రధాన భాద్యత కేంద్రంలోని బిజెపి దేనని మండిపడ్డారు. కేంద్రప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరుతో నిభందనలు మర్చేసిందని దుయ్య బట్టారు. గత వైసిపి ప్రభుత్వం గుడ్డిగ పచ్చజెండ వూపితే వాటిని మార్చుతామని అదికారంలోకి వచ్చిన తెలుగుదేశం,జనసేన ప్రభుత్వం అదేదారిలో నడుస్తుందని విమర్శించారు. ఆనాడు స్మార్ట్‌మీటర్లను పగులగొ డతామని ప్రకటనలు చేసిన మంత్రి నారా లోకేష్‌బాబు నేడు మీటర్లు బిగించాలని ఆదేశాలివ్వడం మోసపూ రితమని ఆక్రోశించారు. కావున విద్యుత్ దోపిడిలో బిజెపి,టిడిపి,జనసేన,వైసిపిలది ఒకేదారి బడాకంపెనీలకు దోచిపెట్టడం,పాలకుల జేబులు నింపుకోవడమేనని అన్నారు. అందుకే అందరం ఐక్యమ వుదాం స్మార్ట్‌మీటర్లను అడ్డుకుందాం రండి కదలిరండని పిలుపునిచ్చారు. ప్రీపెయిడ్ స్మార్ట్‌మీటర్లకు వ్యతిరే కంగ వామపక్షాలు నిర్వహించే పోరాటాలు ఆందోళనలలో భాగస్వాములు కావాలని పిలుపుని చ్చారు. అనంతరం విధులలోవున్న చిన్నక్రాక లైన్‌మెన్ అంకయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈనిరసన కార్యక్రమం లో గడ్డం విజయలక్ష్మి తదితర నేతలు పాల్గొన్నారు.

## ప్రవేటు వైద్యశాలల్లో నిబందనలు కచ్చితంగ పాటించాలి



**కావలి, ఆగష్టు11, ప్రభాతవార్త:** ప్రవేటు వైద్యశాలల్లో ప్రభుత్వ నిబందనలు కచ్చితంగ పాటించాలని కావలి డిప్యూటి డిఎంఅం డ్‌హెచ్‌ఓ డాక్టర్ పి బ్రిజిత తెలిపారు. కావలి పట్టణంలోని పలు ఆసుపత్రు లనుసోమవారం డాక్టర్ బ్రిజిత తనిఖీలు నిర్వహిం చారు. ఈసంద ర్బంగ ఆమె మాట్లాడారు కావలి పట్టణంలో ప్రవేటు వైద్యశా లలు నిర్వహించే నిర్వాహకులు కచ్చితంగ ప్రభుత్వ నిభందనలు పాటించాలనిఅతిక్రమిస్తే చట్టపర మైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రవీణ్ ఆసుపత్రి,లైఫ్‌కేర్ ఆసుపత్రి,లతాతల్లిపిల్లల ఆసుపత్రి ,రవికాంత్ ఆసుపత్రి,లక్ష్మీనారాయణ హాస్పిటల్,ఎస్‌వి ల్యాబ్‌ను తనిఖీచేసి పలు రికార్డులను, రోగులకు అందిస్తున్న సేవలను వాటి నమోదు రికార్డులను చూశారు. ప్రవేటు ఆసుపత్రులు నిర్వహిస్తున్న ప్రతి వక్కరు ఆద్రప్రదేశ్ అల్లోపతి క్లీనికల్‌కేర్ ఎస్టాబ్లిస్‌మెంట్ యాక్టు 2002కింద తప్పనిసరిగ నమోదుచేసు కోవాలని లేనియడల చట్టపరమైన చర్యలుంటాయని అన్నారు. తప్పనిసరిగ పొల్యూషన్, ఫైర్‌సేప్‌టి మెజం"మెంట్సు బయో మెడికల్ వేస్టేజ్,హాస్పిటల్స్ అందిస్తున్న సేవలు,డాక్టర్‌యొక్క వివరాలు వారు వసూలు చేస్తున్న ధరలు తెలియజేసే బోర్డులను తప్పనిసరిగ ప్రదర్శించాలని ఆదేశించారు. ఇకనుంచి ప్రతి మూడు నెలలకోసారి ప్రతి హాస్పిటల్‌ను సందర్శించి లోటుపాట్లువుంటే ఖచ్చితంగ చట్టపరమైన చర్యలుం టాయని హెచ్చరిం చారు. ఈతనిఖీలలో డాక్టర్ వెంక గైనికాలజిస్ట్ డాక్టర్ వెంకటలక్ష్మి, డిప్యూటిసహాయాదికారి డాక్టర్ మెఘ నాద్,ఎస్ శివకుమార్‌లు పాల్గొన్నా .

## గర్భవతులు రక్తహీనతను అదిగమించాలి



**కావలి, ఆగష్టు11, ప్రభాతవార్త:** గర్భవతులు, బాలింతలు రక్తహీనతను అదిగమించి రక్తపరీక్షలు నిర్వహించి,రక్తం చాలా తక్కువవున్న వారికి రక్తంకూడ ఎక్కిస్తామని పౌష్టికాహారం తీసుకోవాలని క్రమంతప్పకుండ వైద్యపరీక్షలు చేయించు కోవా లని తద్వార మాతృ,శిశు మరణాలు నివారించవచ్చని వైద్యాది కారి డాక్టర్ మహేష్ తెలిపారు. ప్రధాన్ మంత్రి సురక్షిత మాతృత్వ పదకంకింద కావలి వెంగళ్‌రావునగర్ పిహెచ్‌సి మరియు డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ సంయుక్త ఆద్వర్యంలో సోమవారం వైద్యసిబిరం చేపట్టారు. ఈశిభిరంలో డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోద యవారు ఐరన్‌పాలిక్,తమ కాల్షియంజింక్,విటమిన్స్ పంపిణీచే శారు. ఈకార్యక్రమంలో డాక్టర్ రామ్‌సెంటర్ ఛైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి,డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజికకార్యకర్త యం మాలకొండారెడ్డి,సిఒ ప్రసాద్ ఎఎన్ఎంలు,ఆశావర్కర్‌లు,గర్భవతులు,బాలింతలు పాల్గొన్నారు.

## వైభవంగా మహా శాంతి హోమం



**కోవూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో స్వామివారి పవిత్రోత్స వాల్లో భాగంగా సోమవారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయప్రధాన అర్చకులు నాగ రాజాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూ జలను సాంప్రదాయబద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణ ంలో మహాశాంతి హోమం, అ



గ్ని గుండాలకు పవిత్రాల సమ ర్పణ, విశేష హో మాలను సాంప్రదాయబద్దంగా నిర్వహిం చారు. అనంతరం స్వామివారికి పూలంగి సేవ, పల్లకి సేవ కా ర్యక్రమాలను కన్ను లపం దువగా నిర్వహించారు. రుత్వికులు శ్రీకాం తాచా ర్యులు,రాఘవాచార్యులు, కృష్ణ మాచార్య స్వామి, సుబ్బయ్య స్వామి, నందకుమార్ స్వామి, ఫణీంధ్ర స్వామి, భక్తులు ఉన్నారు. భక్తులు ఉన్నారు.

## సదరంకు వచ్చే వారు నిర్ణీత పత్రాలతో రావాలి



**కోవూరు, ఆగస్టు11 ప్రభాతవార్త :** కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి ప్రతి సోమవారం సదరం స్లాట్ బుక్ చేసు కుని పరీక్ష నిమిత్తం వచ్చే రోగులు తప్పని సరిగా వారి దగ్గర ఉన్న ధృవీకరణ పత్రా లతో తప్పనిసరిగా హాజరు కావాలని డాక్టర్ ఎన్. అమృత తెలిపారు. కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం సదరం స్లాట్ బుక్ చేసుకున్న వికలాం గులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ వారి దగ్గర ఉన్న ధృవీకరణ పత్రాలను ఆధార్‌తో కలిపి జెరాక్స్ తీసుకుని రావాలన్నారు.

## జాతియ నులిపురుగుల నిర్మూలనను విజయవంతం చేయండి



**రాపూరు, ఆగష్టు11ప్రభాతవార్త :** జాతియ నులిపురుగల నిర్మూలనా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాపూరు యంపీడీఓ మారెళ్ళ భవాని కోరారు. సోమవారం రాపూరు మండల ప్రజా పరిషత్ కార్యలయంలో రాపూరు లోకేటేడ్ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ భాను, ఇతర వైద్య సిబ్బందితో కలిసి నులిపురుగుల నిర్మూలనా(డివార్మింగ్),కార్యక్రమానికి సంబందించిన పోస్టర్‌లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వైద్యాధికారి డాక్టర్ భాను మాట్లాడుతూ జాతియ నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమానికి సంబందించిన అల్బెండోజల్ మాత్రలను మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఇప్పటికే ఢీవార్మింగ్‌కు సంబందించి అల్బెండోజల్ మాత్రలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. 1 నుండి 18 సంవత్సరాల లోపు పిల్లలందరికి ఈ మాత్రలు ఇచ్చి మింగించడం జరుగుతుందని తెలిపారు. మండలంలో మొత్తం 11,560 మంది పిల్లలతో పాటు బడి బయట వున్న 70 మంది విద్యార్థుల చేత కూడా ఈ మాత్రలు మింగించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ మాత్రలు మింగడం ద్వారా విద్యార్థులలో రక్తహీనతను నివారించ వచ్చని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో యంపీడీఓ కార్యలయం సీనియర్ సహాయకుడు పిల్లకదువు చంద్రశేఖర్, యం.పి.హెచ్.ఇఒ షేక్ అబ్దుల్ సలాం, హెచ్‌వి. సుప్రజ,యంపిహెచ్ఎ కాంతమ్మ, ఆరోగ్య కార్యకర్త హరితా, అశా నారాయణమ్మ తదితరులున్నారు.

## తల్లీదండ్రులను పట్టించుకోని పిల్లలపై చట్టపరమైన చర్యలు



**కావలి, ఆగష్టు11, ప్రభాతవార్త:** తల్లీతండ్రులను పట్టించుకోని పిల్లలపై సీనియర్‌సిటిజన్ యాక్ట్‌కింద చర్యలుతీసుకోవడం జరుగుతుందని కావలి ఆర్‌డిఓ సన్ని వంశీకృష్ణ తెలిపారు. కావలి ఆర్‌డిఓ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు భారత ప్రభుత్వ ఉత్వర్వులమేరకు 2007చట్టంప్రకారం వృద్దాప్యంలో వున్న తల్లిదండ్రలను కుమారులు కుమార్తెలు వారి సంరక్షణాభాద్యతల్లో నిర్లక్ష్యం వహిస్తే అట్టివారాపై చర్యలు తీసుకుంటామన్నారు. అంతేకాకుండ వీరికి జరిమాన,జైలుశిక్ష విధించడం జరుగుతుందని అన్నారు. సీనియర్ సిటిజన్‌లకు న్యాయంచేసేందుకు భాద్యతలను ప్రభుత్వం డివిజనల్ పరిధిలోని అధికారులకు భాద్యతలు అప్పజెప్పడం జరిగిందని తెలిపారు. ద్రుద్దాప్యంలో వున్నవారికి వారికుమారులు,లేద సంరక్షకుల వద్దనుండి 10వేల రూపాయలు మెయింట్‌నెన్స్ కింద ఇవ్వాలని అన్నారు. పదివేల రూపాయలు ఇవ్వకపోతే వారి ఆస్తిని జప్తుచేయడంకాని,ఒకనెల జైలుశిక్ష విదించడం జరుగుతుందని అన్నారు. వీరికి ఇంటిలో సపరేట్ రూము సరైనవసతుల ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అదికారం కల్పించిందన్నారు. దీల్లో తల్లితండ్రలులు వారి పిల్లలమద్య జరిగే ఒప్పందంమాత్రమేనని దీనిలో తీగల్గ ఎవరు ఇన్‌వల్వుకాకూడదని అన్నారు సీనియర్ సిటిజన్ సమస్యలు కేవలం 90రోజుల్లోనే పరిష్కరించడం జరుగుతుందన్నారు .తల్లిదండ్రులు ఆస్తిని వారి పిల్లలకుకాని సంరక్షకులకుగని చూడడంకోసం ఆస్తిని రాసిఇచ్చినట్లయితే సరిగ చూడకపోతే ఇచ్చిన ఆస్తిని తిరిగి తీసుకునే హక్కువారికి వుంటుందన్నారు.

## పంచాయితీ పరిశుభ్రతకు ప్రతి ఒక్కరు సహకరించాలి



**రాపూరు, ఆగష్టు11ప్రభాతవార్త :** మండల కేంద్రమైన రాపూరు పంచాయితీలో పరిశుభ్రతకు ప్రజలు ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాపూరు యంపీడీఓ మారెళ్ళ భవాని కోరారు. సోమవారం రాపూరులోని పెద్ద పీర్ల ఛావిడి వద్ద మరుగు కాలువలు శుభ్రపరిచే కార్యక్రమాన్ని యంపీడీఓ భవాని పంచాయితీ కార్యదర్శి కవితతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ పంచాయితీలో రోజు చెత్తను తోలగిస్తు న్నప్పటికి ప్రజల సహకారం సరిగా లేక మరలా ఎక్కడికక్కడే చెత్తను పడవేస్తుండటంతో తిరిగి చెత్త పేరుకు పోతుందన్నారు. ఇప్పటికే పంచాయితీలో చెత్తను సేకరిం చేందుకు చెత్త బుట్టలను పంపిణీ చేసినప్పటికి ప్రజలు వాటిని వినియోగించడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రజలు చెత్తను బుట్టలలో వేసుకొని ప్రతి రోజు పంచాయితీ చెత్త ట్రాక్టర్ వచ్చిన సమయంలో చెత్తను అందు లో వేయాలన్నారు. అలా కాకుండా బయట వేయడం ద్వారా చెత్త పేరుకుపోతున్నట్లు తెలిపారు. ఇప్ప టికైనా ప్రజలు పంచాయితీ పరిశుభ్రంగా వుండేందుకు సహకరించాలని కోరారు.

## 14న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు ఆగస్టు 11 ప్రభా తవార్త :** కోవూరులోని నేతాజీ నగర్ లో ఉన్న వైకేఆర్ఎన్కె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 14వ తేదీ మెగా జాబ్ మే ళాను నిర్వ హిస్తున్నట్లు కళా శాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీ మ్రప సన్న తెలిపారు స్థానిక డిగ్రీ కళాశాలలో సోమ వారం ఆమె మాట్లాడుతూ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్ర శాంతి రెడ్డి ఆంధ్రప్రదేశ్ నైపుణ అభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ మెగా జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు ఈ జాబ్ మేళాలో 13 ప్రముఖ కంపెనీలు పాల్గొంటారని సుమారు ఇందులో 800 ఉద్యోగాలు భర్తీ చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆమె తెలియజేశారు కోవూరు నియోజకవర్గ పరిధిలోని పదవ తరగతి ఇంటర్ డిగ్రీ డిప్లమా ఐటిఐ బీటెక్ ఫార్మసీ చదివిన నిరుద్యోగ యువతీ యువ కులు ఈ జాబ్ మేళాను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు యువత వారికి సంబంధిం చిన విద్యార్హత పత్రాలు రెస్యూమ్, నైపుణ్యం పోర్టల్ లో రిజిస్టర్ చేసుకోవాలని ఈ సందర్భంగా ఆమె సూచిం చారు ఇతర వివరాల కొరకు ఫోన్ నెంబర్లు9381265558,6301529271 అనే నెంబర్లకు సంప్ర దించాలన్నారు

## స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి



**కోవూరు ఆగస్టు 11 ప్రభాతవార్త :** అధి కారులకి రాకముందు ఒక మాట వచ్చిన తర్వాత ఒక మాట కూడా ప్రభు త్వం మాటా ్లడుతుందని ప్రజలంతా ఆదాన్ని స్మార్ట్ మీట ర్లను వ్యతిరేకించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గండవరపు శేషయ్య పిలుపునిచ్చారు కోవూరు లోని బజాజ్ సెం టర్లో సోమవారం స్మార్ట్ మీట్లను వ్యతిరేకిస్తూ కరపత్రాల ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండ్లకు ఆదాన్ని స్మార్ట్ మీటర్లు బిగించ వద్దని స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు కార్పొరేటర్ వ్యవస్థకు లాభాలు చేకూర్చడమే ఈ స్మార్ట్ మీటర్లేనన్నారు గతంలో ఎన్నికల ప్రచారంలో నారా లోకేష్ బాబు పొలాల వద్దకు వచ్చి స్మార్ట్ మీటర్లు బిగిస్తే వాటిని పగలగొట్టాలని పిలుపునిచ్చారని ప్రస్తుతం మాట తప్పారన్నారు సందర్భంగా బజార్ సెంటర్లో షాపు షాపుకు వెళ్లే కరపత్రాలుపంపిణీ చేశారు ఈ కార్యక్ర మంలో సిపిఎం నాయకులు బుజ్జయ్య పెద్దన్న చాన్ బాషా సుబ్బారావు భాస్కర్ మల్లికార్జునరెడ్డి శివ గోవర్ధన్ ఎస్ దాని తదితరులు ఉన్నారు

## పరిహారం పెంచాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కి వినతిపత్రం



**ఉలవపాడు, ఆగష్టు 11, ప్రభాతవార్త** కరేడు పంచాయతీ పరిధిలోని ఉప్పరపాలెం ఎస్సీ కాలనీ వాసులు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ పరి హా రం పెంచాలని సోమవారం నాడు ఉలవ పాడు తహసీల్దార్ కార్యాలయంలో తెలుగు గంగా డిప్యూటీ కలెక్టర్ మురళికి వినతిపత్రం అందిం చారు. విజయవాడ జిల్లా కలెక్టర్ ఆనంద్ ఉప్ప రపాలెం ఎస్సీ కాలనీ ప్రజలతో సమావేశమై ఇండోర్ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ఉప్పరపాలెం ఎస్సీ కాలనీ తరలించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఈ క్రమంలో బాధితులకు ప్రభుత్వాం నుంచే ఆర్అండ్ ఆర్ ప్యాకేజీ గురించి విపులంగా వివరించారు. జీవన భృతి నూతన ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం పది లక్షల పరిహారం కింద అందిస్తుందని, ఈ పరిహారం ఒక్కొక్క కుటుంబానికి సరిపోదని ఆ పరిహారాన్ని 20 లక్షలుగా పెంచాలని ఉప్పరపాలెం ఎస్సీ కాలనీ వాసులు డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎస్సీ కాలనీ పెద్దలు , యువకులు ఉన్నారు.

